



దస్తగిరి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రభాకర్‌రెడ్డి, గౌస్‌దేశాయ్, తదితర సిపిఎం నాయకులు

పశ్చిమ ప్రాంత అభివృద్ధికి చర్యలు

- హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు
- పక్కాగా కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు
- దిశా కమిటీ ఛైర్మన్ ఎంపీ బస్తిపాటి నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు. వేదికపై కలెక్టర్ సిరి, జడ్‌పి ఛైర్మన్ పాపిరెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో పశ్చిమ ప్రాంత విద్యాభివృద్ధిలో భాగంగా పిల్లలు చదువుకునేందుకు అవసరమైన హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదలను పంపాలని దిశా కమిటీ ఛైర్మన్, కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు కలెక్టర్‌కు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా మెసేజ్ పెట్టినా స్పందించలేదని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఒక ఎంపీ ఫోన్ చేసినా జిల్లా అధికారి స్పందించకపోవడం సరైనది కాదన్నారు. వెంటనే జిల్లాకలెక్టర్ జోక్యం చేసుకొని ప్రజాప్రతినిధులకు అధికారులు తప్పనిసరిగా స్పందించాలని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో దిశాకమిటీ ఛైర్మన్, ఎంపి బస్తిపాటి నాగరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎంపి బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ దేవనకొండ, ఆస్పరి, ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ మండలాలు కూరగాయల సాగుమీద ఆధారపడిన మండలాలని, సంబంధిత ప్రాంతాలలో రూరల్ హాట్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. రైతులు పండించిన పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. కర్నూలు మార్కెట్ యార్డులో ఆర్‌డిఎఫ్ నిధులతో మల్టీకోల్ స్టోరేజ్ నిర్మాణాలు మధ్యలో ఆగిపోయాయన్నారు. నేషనల్ లైవ్‌మిషన్ పథకంలో భాగంగా గొర్రెలు, మేకల యూనిట్‌లను ఏర్పాటు చేసుకునే విధంగా గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. పిఎంకెఎస్‌వై కింద వాటర్ షెడ్ ప్రాజెక్టులకు సంబంధించి ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలను తనకు ఇవ్వాలన్నారు. నిధుల మంజూరు కోసం కృషి చేస్తానని ఎంపీ డ్వామా ఎపిడికి సూచించారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద బిటి రోడ్లు వేయించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని పంచాయతీ రాజ్ ఎస్ఇని ఆదేశించారు. కర్నూలులో క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు తగిన డిజైన్, ఎస్టిమేట్లు సిద్ధం చేసి పంపాలని డిఎస్‌డిఒను ఆదేశించారు. త్రిబుల్ ఐటిడిఎం విద్యాసంస్థకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంపీ కర్నూలు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ నేషనల్ లైవ్ మిషన్ పథకం గురించి గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. జిల్లాలో నీటి సమస్య తలెత్తకుండా ముందే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పథకాల అమలుకు సంబంధించి ఎంపి నిర్దేశించిన విధంగా ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. వసతి గృహాలకు మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. నూతన వసతి గృహాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించే విధంగా చూడాలని ఎంపిని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో రూ.17 కోట్లతో టాయిలెట్ మరమ్మతులు చేయించేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. సమావేశంలో స్టేట్ లెవెల్ దిశా కమిటీ సభ్యులు, జిల్లా స్థాయి దిశా కమిటీ సభ్యులు, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, స్టేట్ లెవెల్ దిశా కమిటీ సభ్యులు రాజశేఖర్ రెడ్డి, చిన్న పవన్‌కుమార్, జిల్లా స్థాయి దిశాకమిటీ సభ్యులు దేవనకొండ విశ్వనాథరెడ్డి, దేవశంకర్, గుండాల సురేంద్రనాథ్, కమ్మరి రాధ, హౌసింగ్ పిడి చిరంజీవి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, ఆర్‌అండ్‌బి ఎస్ఇ మహేశ్వర రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి రాజాకృష్ణరెడ్డి, ఐసిడిఎస్ పిడి విజయ, డిఆర్‌డిఎ పిడి రమణారెడ్డి, సిపిఒ భారతి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి-గూడూరు



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కె.నాగలాపురం పోలీసు స్టేషన్‌ను కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ శుక్ర వారం వార్షిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తులు, వాటి పురోగతి పై కేసుల ఫైళ్ళను క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల గురించి ఆరా తీశారు. డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌లపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టాలన్నారు. కేసులు నమోదుచేసి శిక్షలు పడేవిధంగా చేయాలన్నారు. ప్రాపర్టీ కేసులను ఛేధించి రికవరీలు చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ చేయాలన్నారు. బాధితులు పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించినప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సైబర్ నేరాలపై, మహిళల చట్టాల పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కె .నాగలాపురంలోని శ్రీ సుంకులమ్మ పరమేశ్వరి అమ్మవారిని జిల్లా ఎస్‌పి దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా ఎస్‌పితో పాటు కర్నూలు డిఎస్‌పి జె.బాబు ప్రసాద్, డిసిఆర్‌బి సిఐ గుణశేఖర్ బాబు, కర్నూలు రూరల్ సిఐ చంద్రబాబు నాయుడు, కె.నాగలాపురం ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

- గూడూరు మున్సిపల్ ఆఫీసు ముందు సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-గూడూరు

పట్టణాలలో , మండలాల్లో ఆయా గ్రామాల్లో ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారని సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి జె.మోహన్ విమర్శించారు. గూడూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి జై.మోహన్, ప్రాంతీయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గూడూరును మున్సిపాలిటీ చేసి ప్రజలపై పన్నుల భారాలు వేశారని, తాగునీటి సమస్య, కనీస వసంతులు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని విమర్శించారు. గత ప్రభుత్వం రూ.54 కోట్లతో గూడూరు పట్టణానికి నాలుగు దిక్కులు స్తంభాలుగా నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మాణం చేపట్టారని, అది మధ్యలోనే ఆగిపోయిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం , ఎమ్మెల్యే, ఎంపి ఈ ట్యాంకుల నిర్మాణం గురించి మాట్లాడడం లేదన్నారు. రోడ్డు విస్తరణ చేయాలని, గూడూరులో నగర పంచాయతీ పేరుతో ఉపాధి లేక వలసలు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మునగాల రోడ్‌లోని డంపుయాడ్ వేరే ప్రదేశానికి మార్చాలన్నారు. మూడవ వార్డులో తూర్పు బిసి కాలనీలో మహిళలకు మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. గూడూరు పిహెచ్‌సిని 100 పడకలుగా అభివృద్ధి చేసి 24 గంటలు వైద్యులను అందుబాటులో ఉంచాలన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ పాలిటెక్నిక్ కళాశాలను, గూడూరులో పెండింగులో ఉన్న మున్సిపల్ కార్యాలయం పనులు పూర్తి చేసి, తహశీల్దార్ కార్యాలయానికి కొత్త భవనం నిర్మించాలన్నారు. నాగలాపురం బూడిదిపాడు, పెంచగలపాడు, జూలకల్లు గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం ప్రాంతీయ కమిటీ సభ్యులు రవి, మధు,శేఖర్, దానమన్న, నాగేష్, గుంటప్ప నాగమద్దిలేటి, మధు, సుంకన్న పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

దస్తగిరి మృతి ఎలక్ట్రిసిటీ ఉద్యమానికి తీరనిలోటు

- సిపిఎం నాయకుల నివాళి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

దస్తగిరి మరణం ఎలక్ట్రిసిటీ ఉద్యమానికి తీరని లోటు అని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ అన్నారు. ఆయన పార్టీ సభ్యుడుగా, ఎలక్ట్రిసిటీ యూనియన్ నాయకుడిగా పని చేశారు. పార్టీ సిద్ధాంతం కోసం పనిచేశారన్నారు. ఆయన ఎన్.గఫూర్ ఎమ్మెల్యేగా పోటీ చేసిన సందర్భాల్లో 1994, 2004 ఎన్నికల్లో ఆయన గెలుపు కోసం అహర్నిశలు కృషి చేశారని చెప్పారు. సీనియర్ నాయకుడును కోల్పోవడం బాధాకరమన్నారు. రిటైర్డ్ అయిన తర్వాత పార్టీకి సానుభూతిపరుడుగా ఉంటూ తన శేష జీవితం పార్టీ కోసం అంకితం చేశారన్నారు. మరణ వార్త విన్న తర్వాత ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి నివాళు లర్పించారు. భౌతిక కాయాన్ని సందర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యే ఎంఎ.గఫూర్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.ఆనంద్ బాబు, ఎండి.అంజిబాబు, పిఎస్.రాధాకృష్ణ, కెవి.నారాయణ, నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పి.నాగరాజు, ముస్లిం నాయకుడు జబ్బర్ మౌలానా, పట్టణ పోరా సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇ. పుల్లారెడ్డి, సభ్యులు యూనిస్, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ నరసింహ, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

కనీస వేతనం రూ.26 వేలివ్వాలి



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

- కలెక్టరేట్ ఎదుట మెప్మా ఆర్‌పి ఉద్యోగుల సంఘం ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మెప్మా ఆర్‌పి ఉద్యోగులకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎపి మెప్మా ఆర్‌పి ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆర్‌పిల సంఘం జిల్లా అధ్యక్షురాలు రుద్రమ్మ అధ్యక్షతన నిర్వహించిన ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ నరసింహులు, ఆర్‌పిల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ ఉమాదేవి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అరుణలు మాట్లాడారు. ఆర్‌పిలను మెట్టిచాకిరి చేయించుకుంటూ కనీస వేతనం కూడా అమలు చేయడం లేదన్నారు. ఒక్కో ఆర్‌పికి నెలలో రూ.800, రూ. 2000, రూ.3000, రూ. 4000 ఈ రకంగా వేతనాలు అందుతున్నాయన్నారు. తక్కువ వేతనాలతో వారి కుటుంబాలు ఏ రకంగా గడుపుకోవాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌పిలపై రాజకీయ వేదికలు కూడా రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. అక్రమంగా ఆర్‌పిలను తొలగించడం సరైనది కాదని మండిపడ్డారు. హెచ్‌ఆర్ పాలసీని అమలు చేసి అమలు చేయాలన్నారు. గ్రేడింగ్ విధానాన్ని రద్దుతో పాటు అభయ హస్తం కోసం కట్టించుకున్న డబ్బులు చెల్లించాలని, లేదా 45 సంవత్సరాలు నిండిన మహిళలకు రూ.2000 పెన్షన్ ఇవ్వాలన్నారు. ఆర్‌పిల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిఐటియు నగర అధ్యక్షులు వై.నగేష్ నగర నాయకులు, వి.వెంకటేశ్వర్లు, ఆర్‌పిల సంఘం నగర అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీబాయి, షబానాలు మాట్లాడారు. సిఐటియు నాయకులు రియాజ్‌బాషా, ఆర్‌పిల సంఘం జిల్లా ట్రెజరర్ సుజాత, ప్రసాద్, కన్యక, నాగేశ్వరి, సంధ్యారాణి, మంజుల, శ్రీదేవి, సుజాత, జ్యోతి, పొదుపు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

-ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కర్నూలు డిఎస్‌పి బాబు ప్రసాద్ సూచనల మేరకు కర్నూలు పట్టణంలో ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కర్నూలు ట్రాఫిక్ సిఐ మన్సూరుద్దీన్ తెలిపారు. శుక్రవారం ఉదయం రాజ్ విహార్, సి. క్యాంపు పలు చోట్ల వాహనాల తనిఖీలు నిర్వహించారు. రికార్డులు లేని వాటికి జరిమానాలు విధించారు. ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సిఐ సూచించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వ్యక్తులను ఆపి, అరగంటపాటు సమయం ఇచ్చి హెల్మెట్లు తెచ్చుకున్న తర్వాతే రోజాపువ్వు ఇచ్చి పంపించారు. హెల్మెట్ ధరించని 50 మందిలో ఒకరికి రూ.1035 జరిమానాలు విధించారు. అతి వేగం , తలకు హెల్మెట్ ధరించకపోవడం వల్లనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయని ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్ తెలిపారు.



ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్యాంకుమార్, టిడిపి అధ్యక్షులు తిక్కారెడ్డి

ఎడవల్లిలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-మద్దికేర

మద్దికేర మండలం యడవల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ విగ్రహాన్ని శుక్రవారం కర్నూలు టిడిపి జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే శ్యాం కుమార్ ప్రారంభించారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు గజమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, దేశంలోనే తొలిసారి రూ.రెండుకిలో బియ్యం ప్రవేశపెట్టి పేదల మనసు దోచుకున్న ఏకైక వ్యక్తి నందమూరి తారక రామారావు అని అన్నారు. పేద వాడికి తినడానికి తిండి, ఇల్లు, కట్టుకోవ డానికి బట్ట కల్పించడం రాజకీయ నాయకుల కర్తవ్యమని బోధించి, ఆచరణలో చూపిన మహానుభావుడు ఎన్‌టిఆర్ అని కొనియాడారు. ఆస్తిలో స్త్రీలకు సమాన హ క్కులు కల్పించి, రేషన్ షాపుల ద్వారా తొమ్మిది రకాల సరుకులు అందించారన్నారు. బీసీలను రాజకీయంలో చైతన్యం చేసి అధికారం అందించాడని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, సర్పంచి నంది కల్పన, మాజీ జడ్‌పిటిసిలు పురుషోత్తం చౌదరి, రాజన్న యాదవ్, మండల సొసైటీ ఛైర్మన్ ఆకుల ఆనందు, కార్యదర్శి రామాంజనేయులు తెలుగు యువత నాయకులు చంద్రశేఖర్ గౌడ్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పత్తి ఓబులయ్య సేవలు అనిర్వచనీయం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్



పత్తిఓబులయ్యను సన్మానిస్తున్న సవ్వప్పగారి ఈరన్న

నంది అవార్డు గ్రహీత కళారత్న పత్తిఓబులయ్య కళారంగానికి చేస్తున్న సేవలు అనిర్వచనీయమని కమల కళానికేతన్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సవ్వప్పగారి ఈరన్న అన్నారు. శుక్రవారం ఉదయం జి కళాక్షేత్రంలో ఆయనను కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. వారం రోజులపాటు సాహిత్య సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించి కళా రంగానికి సేవ చేశారని కొనియాడారు. ఎంతోమంది కళాకారులను సాహితీవేత్తలను సత్కరించిన సంస్థగా 50 దశాబ్దాలకు పైగా విశేషమైన కృషి చేస్తున్న టిజివి కళాక్షేత్రం ఘనతను దేశవ్యాప్తంగా చాటుతున్న ఓబులయ్యకు తెలుగు బుక్ రికార్డ్స్ రావడం సముచితమని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం సభ్యులు రమణ, డాక్టర్ కదిరి రమేష్, ముద్రిక భాస్కర్, రామ గోవిందు ఉన్నారు.

యనగండ్లలో డ్రెయినేజీ అస్తవ్యస్తం

-రోడ్లపైనే మురుగు నీరు -ప్రజలకు తప్పని తిప్పలు -స్పందించని అధికారులు

ప్రజాశక్తి- సి బెళగల్

సి బెళగల్ మండలం యనగండ్ల గ్రామంలో ప్రధాన వీధులలో మురుగునీరు పారుతుంది. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మారెమ్మ టెంపుల్ వీధుల్లో, బిసి వీధుల్లో, ప్రాథమిక పాఠశాల ముందు, ఎస్‌సి కాలనిలోని పలు వీధుల్లో ఎక్కడికక్కడే మురుగు నీరు నిలిచి అక్కడ దోమలు వద్ధి చెందుతున్నాయి. దుర్వాసన, దోమలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగు నీరు కదలని చోట పందులు పొర్లుతూ స్వైర విహారం చేస్తున్నాయి. యనకండ్లలోని అన్నీ వీధులు ఇలానే ఉండటం వలన ప్రజలు ఆవందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ లాంటివి చల్లించే నాథులే లేరని గ్రామస్తులు వాపోతున్నారు.

కానరాని స్వచ్ఛకార్మికులు-స్పందించని సర్పంచి

గ్రామంలో చెత్త చెదారం ఎత్తి వేసి పరిశుభ్రంగా ఉంచాల్సిన స్వచ్ఛ కార్మికులు కానరావడం లేదు. గత ఏడాది కింద వరకు ముగ్గురు కార్మికులు ఉండేవారని వేతనాలు ఇచ్చేవారు లేక.. ఒక వేళ పని చేసే వారు ఉన్నప్పటికీ రాజకీయ వేధింపులు చేసి అక్రమంగా తొలగించినట్లు తెలుస్తోంది. తప్పని పరిస్థితిలో సర్పంచి కుటుంబికులే పారిశుధ్య కార్మికులుగా ఉన్నారు. వారు సక్రమంగా పని చేయనందున చెత్తాచెదారం పెరిగిపోయిందన్నారు. ప్రధానంగా సీసీ రోడ్లకు ఇరువైపులా మురుగు కాల్వలు లేక పోవడంతో డ్రైనేజి అస్తవ్యస్థంగా మారింది.సర్పంచి ప్రయివేటు ఉద్యోగంలో పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. అక్కడి కార్యదర్శి సర్పంచి తీరును ఆసరాగా చేసుకొని విధులకు డుమ్మా కొడుతూ గ్రామంలో డ్రైనేజి సమస్య గాలికొదిలేశారని స్థానికులు విమర్శిస్తున్నారు.



బురద నీటిలో నడుస్తూ స్కూలు వెళ్తున్న చిన్నారులు

సిసి రోడ్డు మధ్యలోనే మురుగు కాల్వ

పెద్దక్క స్థానికురాలు యనగండ్ల గ్రామం



మా వీధిలో సిసి రోడ్లు ఉన్నా మురుగు కాల్వలు లేవు. ఒక పక్క కాల్వ ఉంటే మరో పక్క కాల్వ లేక అగచాట్లు పడుతున్నాం. అవతలి కాల్వకు మురుగు నీరు వెళ్ళనివ్వరు. సీసీ రోడ్డు పైనే మధ్యలో తప్పని పరిస్థితిలోమరో కాల్వ ఏర్పాటు చేసుకున్నాం. అధికారులు గ్రామాన్ని సందర్శించి మురుగు కాల్వలు నిర్మించి ప్రజారోగ్యాన్ని కాపాడాలి.

పట్టించుకునే వారు కరువయ్యారు

-వెంకటేష్ , యనగండ్ల



గ్రామంలో పలు వీధుల్లో సీసీ రోడ్లు లేక మట్టిరోడ్లపైనే మురుగు నీరు వెళ్తూ అవస్థలుపడుతున్నాం. సిసి రోడ్లుతో పాటు సైడు కాల్వలు నిర్మించాలి.నెలలు గడిచినా రోడ్డుమీద నిలిచిన మురుగును తొలగించే వారు లేరు.. సర్పంచి కుటుంబంలోనే ఓ ఇద్దరూ పని చేస్తున్నా అన్నీ వీధుల్లో పని చేయుటకు సమయం చాలట్లేదు.

మురుగులో అడుగు పెడితేనే బడికి

మేరీన విద్యార్థిని



మా బడికి వెళ్లాలంటే మురుగు నీటిలో నే నడవాలి. వద్దను కుంటే బడికి చేరుకోలేం. మా బడికి ఆను కొని రోడ్డు ఎంత దూరం ఉంటే అంత దూరం రోడ్డుపైనే మురుగు పారుతుంది. పాఠాలు వినేప్పుడు విషదోమలు కరుస్తు న్నాయి.

శరీర నిర్మాణ పనితీరు తెలిపేదే ఫిజియాలజీ

కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ కె చిట్టి నరసమ్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మానవ శరీరంలోని అంతర్గత నిర్మాణాల పనితీరు అవి ఆరోగ్యంగా ఉంటే మనిషి రోగాలకు దూరంగా ఉండి పనిచేయగలుగుతాడని కర్నూలు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ అన్నారు. శుక్రవారం కర్నూలు మెడికల్ కాలేజీలో ఫిజియాలజీ విభాగంలో ఈ నెల 17వ తేదీ నుండి 21 వరకు నిర్వహిస్తున్న ఫిజియాలజీ వారోత్సవాల ముగింపు సందర్భంగా న్యూ లెక్చరర్ గ్యాలరీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి వైద్య విద్యార్థి శరీర అంతర్గత భాగాల నిర్మాణం వాటి పనితీరు ప్రభావితమయ్యే అంశాలపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలని, ఫిజియాలజీ పై పట్టు సాధిస్తే అనాటమీ ఫార్మకాలజీ మైక్రోబయాలజీ పెథాలజీ మెడిసిన్ తోపాటు అన్ని క్లినికల్ విభాగాల్లో రాణించగలుగుతారన్నారు. తద్వారా వైద్య విద్యలో మంచి ఫలితాలు సాధిస్తారని తెలిపారు. అతిథిగా పాల్గొన్న మైపర్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ అంతర్గత ఆరోగ్యంతో పాటు మానవ శరీరం బయటి పరిస్థితులు కూడా అనుకూలంగా వుంటే మనిషి సంతోషంగా ఆరోగ్యంగా ఉండగలరని అన్నారు.ఫిజియాలజీలో కణ నిర్మాణం శరీర భాగాల నిర్మాణం పనితీరుపై అధ్యయనం చేయడం ద్వారా కొత్త వ్యాధులపై నిరంతర నిఘా కొనసాగించ వచ్చునని తెలిపారు. ఫిజియాలజీ విభాగఅధిపతి ప్రొఫెసర్ సుధారాణి మాట్లాడుతూ ఈనెల 17 నుండి ఫిజియాలజీ వారోత్సవాల సందర్భంగా ఈ పోస్టర్ ప్రజెంటేషన్, విద్యార్థులకు క్విజ్ ప్రోగ్రామ్స్, విద్యార్థులకు ఫిజియాలజిపై అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. . వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ సాయి సుధీర్, డాక్టర్ విజయ్ ఆనంద్ బాబు, డాక్టర్ సింధియా శుభప్రద, ఫిజియాలజీ విభాగపు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాధిక, డాక్టర్ ఎలిజబెత్, అసిస్టెంటు ప్రొఫెసర్లు, పీజీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ



రైతు రక్షణలో కూటమి ప్రభుత్వం విఫలం

వైసిపి రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంగాల భరత్ కుమార్

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో రైతుల సమస్యలు పరిష్కారం కావడంలేదని వైసిపి రైతు విభాగం రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ వంగాల భరత్ కుమార్ అన్నారు. శుక్రవారం కర్నూలు నగరంలోని ఎస్‌వి కాంప్లెక్స్‌లో వైసిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వంగల భరత్ కుమార్ మాట్లాడుతూ ఉల్లి ,పత్తి, మిర్చి రైతులు మద్దతు ధర లేక రాష్ట్రంలో ఇక్కట్లు పడుతున్నారని అన్నారు. అన్న దాత సుఖీభవ పేరుతో రైతులకు అరకొరగా నిధులు కేటాయించారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆర్‌బికెలను నిర్వీర్యం చేశారని అన్నారు. కర్నూలు జిల్లాలో ఉల్లి రైతులకు మద్దతు ధర రూ 1,200 ఇచ్చినప్పటికీ రైతుల ఖాతాలో ఇప్పటి వరకు జమకాలేదు అన్నారు. అరటి, మామిడి రైతులకు మద్దతు ధర ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. రైతులంటే చంద్రబాబు కు చిన్న చూపని, 17 నెలల్లో రైతులకు గిట్టుబాటు ధర లేక అప్పులతో ఆత్మహత్య చేసుకున్నా పట్టించుకోవడంలేదని అన్నారు. గత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో రైతులకు పెద్ద పీట వేసి రైతులకు ఇన్పుట్ సబ్సిడీ తోపాటు ఈ క్రాప్ ఇన్సరెన్స్ ఇచ్చారని అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు కేంద్రాలతో పాటు యూరియా బస్తాలను కూడా సరఫరా చేశారన్నారు. రాష్ట్రంలో అమరావతి భవనాల మీద ఉన్న ప్రేమ రైతుల పట్ల లేదని విమర్శించారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి

-జాతీయ మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షులు గ్యాస్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మత్స్య సహకారసంఘాల అభివృద్ధికి ఒక నిర్దిష్టమైన ప్రణాళికను రూపొందించాలని జాతీయ మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షులు గ్యాస్ శ్రీనివాసులు కోరారు. శుక్రవారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కర్నూలు పట్టణంలోని జాతీయ మత్స్యకారుల సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్యాస్ శ్రీనివాసులు మాట్లాడారు. రాష్ట్రంలో ప్రాథమిక మత్స్య సహకార సంఘాలు గత కొన్ని దశాబ్ధాలుగా వివిధ సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. మత్స్యకారుల సంక్షేమాన్ని , వాళ్లకు రావాల్సిన విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వాటాలను కోల్పోతున్నారన్నారు. జిల్లాలో చెరువులు, కుంటలు రిజర్వాయర్లలో వేటద్వారా వచ్చిన చేపలను మార్కెటింగ్ చేసుకొనుటకు కర్నూలు పట్టణంలో మోడ్రన్ చేపల మార్కెట్ ఏర్పాటు చేస్తామని, అప్పటి టిడిపి ప్రభుత్వం ప్రకటించిందని ఇంతవరకు అతీగతి లేదని అన్నారు. చేపల వేట నిషేధ సమ యంలో మత్స్యకార సభ్యులకు చెల్లించె మత్స్యకార భరోసా రాయల సీమ జిల్లాలకు కూడా వర్తింపచేయాలని అన్నారు. ఎన్నికల సమయంలో మత్స్యకా రులకు ప్రకటించిన మేనిఫెస్టోను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘము నాయకులు బెస్తపుల్లయ్య, తెలుగు నాగరాజు, తెలుగు కన్న,వినయ్, మహిళా నాయకురాళ్లు బెస్త పావని, బెస్త మమత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రబీ పంటలకు సాగునీటి విడుదల

- స్టాండింగ్ క్రాప్స్‌కు పంట చివరి వరకు నీరందిస్తాం - ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని సంజీవయ్య సాగర్ (గాజులదిన్నె ప్రాజెక్టు) కాలువలకు శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి, ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కె.మల్లికార్జున గౌడ్, ఇరిగేషన్ ఎస్ఇ బాలచంద్రారెడ్డి, ఈఈ పాండురంగయ్యతో కలిసి నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రాజెక్టు ఆయకట్టు కింద సాగు చేసిన 12,500 ఎకరాలకు కుడి కాలువ నుంచి 150 క్యూసెక్కులు, ఎడమ కాలువ నుంచి 50 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. టిడిపి అధికారంలోకి వస్తే వర్షాలు కురవవని గతంలో వైసిపి నాయకులు ప్రచారం చేసే వారని, ప్రస్తుతం రాష్ట్రంలో వర్షాలు పుష్కలంగా కురిసి ప్రతి చెరువు, ప్రతి కుంట, ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతున్నాయని చెప్పారు. గత వైసిపి హయాంలో ప్రాజెక్టు ఎత్తు ఒక మీటర్ పెంచినప్పటికీ ఆయకట్టు విస్తీర్ణం మాత్రం పెరగలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో తాను 3 టిఎంసీల హెచ్ఎన్ఎస్ఎస్ జలాలను తేవడం వల్ల ప్రాజెక్టు నీటి కొరత లేకుండా కళకళలాడుతోందని తెలిపారు. ఆయకట్టు కింద రబీలో సాగు చేసిన పంటలకు జనవరి వరకు నీరందిస్తామన్నారు. స్టాండింగ్ క్రాప్స్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పంట చివరి వరకు నీరందించే చర్యలు చేపడతామన్నారు. నియోజకవర్గానికి రావాల్సిన ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకుంటామని తెలిపారు. డిఇఇ సుబ్బరాయుడు, తహశీల్దార్ రాజేశ్వరి, ఎంపిడిఒ మణిమంజరి పాల్గొన్నారు.

అనుమతుల్లేని నిర్మాణాలపై చర్యలు

- కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



మాట్లాడు తున్న సోమిశెట్టి వెంకటే శ్వర్లు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని కుడా ఛైర్మన్ సోమి శెట్టి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. స్థానికంగా జరుగుతున్న వాణిజ్య కార్యకలాపాలు, గృహ నిర్మాణాల పేరుతో చేపట్టిన కట్టడాలను శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంత్రాలయంలో కుడా అనుమతి లేకుండా అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నాయని సమాచారం మేరకు తనిఖీలు చేపట్టామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జారీ చేసిన కట్టడాలకు అనుమతుల కోసం మరో మూడు నెలలు గడువు పెంచారని తెలిపారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టాలని ప్రయత్నించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పంచాయతీ ద్వారా చెల్లించే పన్నుల వల్ల 75 శాతం పంచాయతీలకు తిరిగి వస్తుందని, ఎల్ఆర్ఎస్ ద్వారా చెల్లించే పన్నుల్లో 50 శాతం కుడాకు వస్తుందని చెప్పారు. పన్నుల వల్ల పంచాయతీ అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మంత్రాలయంలో అనుమతులు లేకుండా చాలా హోమ్‌స్టేలు, లాడ్జి నిర్మాణాలు జరుగుతున్నాయని, వెంటనే ప్రభుత్వ అనుమతి పొందాలని తెలిపారు. నీటి సరఫరా, విద్యుత్ సరఫరా వంటి వాటిని నిలిపి వేసే వరకు తెచ్చుకోవద్దని హితవు పలికారు.

నేల ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



నమూనా పరీక్షలు నిర్వహిస్తున్న విద్యార్థులు

నేల ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన అవసరమని వ్యవసాయ సహాయ సంచాలకులు పి.అశోక్ వర్ధన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో నేల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు నేల ఆరోగ్యం, భూసార పరీక్షల ఆవశ్యకత, మట్టి నమూనాలు తీసే పద్ధతిని చూపించి, భూసార పరీక్ష చేయించుకోవడంలో ఉన్న లాభాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు 50 మట్టి నమూనాలను సేకరించి వారి పాఠశాలలో విద్యార్థులే పరీక్ష చేసుకునే విధంగా కేంద్ర ప్రభుత్వం కిట్లు అందజేసింది. పాఠశాల వైస్ ప్రిన్సిపల్ రహిమాన్ బాష, సైన్స్ టీచర్ హరీష్ కుమార్, వ్యవసాయ అధికారులు ఇందుమతి, నవీన, లావణ్య, కిరణ్ కుమార్, ఎఒ శివశంకర్, కెవికె బనవాసి శాస్త్రవేత్త తేజ, సిబ్బంది రామాంజినేయులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు 'తెల్ల'బోయి..!

- పత్తి రైతులకు 'స్లాట్' సమస్య
- కేంద్ర నిబంధనలతో మరిన్ని ఇబ్బందులు
- పెట్టుబడి రాకున్నా.. ప్రయివేట్ వ్యాపారులకే అమ్మకం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. దిగుబడి తగ్గి, మద్దతు ధర దక్కక, సిసిఐ నిబంధనలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిన్నింగ్ మిల్లుల్లో మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేసేలా సిసిఐ నిర్ణయం తీసుకుంది. గతనెల 29న జిల్లాలో పత్తి పండించే నియోజకవర్గాల్లో పత్తి కొనుగోలు కేంద్రాలను సిసిఐ ప్రారంభించింది. జిల్లాలో సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలు నామమాత్రంగానే ఉన్నాయి. అదీ అరకొరగానే జరుగుతున్నాయి.

ఆదోని నియోజకవర్గంలో ఇప్పటి వరకు 22 వేల క్వింటాళ్ల పత్తిని సిసిఐ కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మొంథా తుపాను, అంతకుముందు భారీ వర్షాలకు పత్తి పంట చాలా వరకు దెబ్బతినింది. ఏడాది పొడవునా పత్తి కొనుగోళ్లు జరిగే ఆదోని మార్కెట్‌లో కూడా పత్తి ధర రూ.7,600 నుంచి రూ.7,300కు పడిపోయింది. మద్దతు ధర లభించక రైతులు లబోదిబోమంటున్నారు. వాస్తవంగా ఎకరాకు 8-10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, గులాబీ పురుగు దాడి, భారీ వర్షాల దెబ్బకు 5, 6 క్వింటాళ్లు కూడా రాలేదు. అధిక వర్షాలు కురిసిన చోట 3, 4 క్వింటాళ్లు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ.50వేల దాకా ఖర్చు పెట్టినా.. పెట్టుబడి కూడా రావడం లేదని పేర్కొంటున్నారు. పత్తి రంగుమారితే క్వింటా రూ.4 వేలకు కూడా కొనడం లేదని, కాస్త బాగున్న పత్తికి రూ.5 నుంచి రూ.6 వేల ధర పలుకుతోందని రైతులు చెబుతున్నారు. సిసిఐ కేంద్రాల్లో తేమ పరీక్షతో ధర తగ్గించడం, స్లాట్ బుకింగ్ విధానంతో వేచి చూడాల్సి వస్తుండడంతో చాలా మంది రైతులు స్థానిక వ్యాపారులకే అమ్ముకుంటున్నారు. ఇదే అదనుగా భావించిన ప్రయివేట్ వ్యాపారులు క్వింటాకు రూ.6 నుంచి రూ.7 వేలు కూడా చెల్లించడం లేదు.

స్లాట్ బుకింగ్‌తో రైతులకు తిప్పలు



సిసిఐ కేంద్రాలకు వచ్చిన పత్తి

పత్తి రైతు కష్టాన్ని కొనుగోలు కేంద్రాలు నిలువునా దోచేస్తున్నాయి. జిల్లాలో 20 రోజులుగా 9 కేంద్రాలు తెరిచి పత్తి కొనుగోలు చేస్తుండగా సిసిఐ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం యాజమాన్యం రైతులకు చుక్కలు చూపుతోంది. ఎకరాకు 7 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేస్తామని సిసిఐ అధికారులు ఘనంగా ప్రకటించారు. ఆ మేరకు రైతులు కపాస్ కిసాన్ యాప్, సిఎం యాప్‌లో నమోదు చేసుకున్నారు. గత రెండు రోజులుగా పత్తి రైతులు దిగుబడులతో సిసిఐ కొనుగోలు కేంద్రానికి క్యూ కడుతున్నారు. స్లాట్ బుకింగ్‌లో ఏర్పడిన సమస్యలు పరిష్కారమైతేనే పత్తి కొనుగోలు చేస్తామంటూ యాజమాన్యం చేతులెత్తేయడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. రెండు రోజులుగా తిండీ తిప్పలు మాని ఎప్పుడు కొనుగోలు చేస్తారా అంటూ నిరీక్షిస్తున్నారు.

తేమ పేరిట ధర తగ్గింపు...

పత్తిలో తేమ 8 శాతానికి మించకపోతే పూర్తి మద్దతు ధర చెల్లిస్తామని, అంత కంటే ఎక్కువగా 12 వరకు ఉంటే.. మద్దతు ధర తగ్గించి ఇస్తామని సిసిఐ ప్రకటించింది. 12 కన్నా అధికంగా తేమ ఉంటే.. కొనుగోలుకు పూర్తిగా తిరస్కరిస్తున్నారు. పత్తిని ఆరబెట్టి తీసుకురావాలని సిసిఐ చెబుతుండడంతో కొందరు రైతులు స్థానిక వ్యాపారులకే అమ్ముకుంటున్నారు. పత్తి కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ ఆధారిత ఈ-క్రాప్‌లో నమోదైన రైతుల నుంచి యాప్ ద్వారా డిజిటలైజ్డ్ విధానాన్ని అమలు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం కొత్తగా కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలని, సిసిఐ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని నిబంధన పెట్టింది. కపాస్ కిసాన్ యాప్‌తో అనుసంధానం చేసినా కొన్ని సాంకేతిక సమస్యలు ఉత్పన్నమై రైతులు ఇబ్బంది పడుతున్నారు. తుపాను, భారీ వర్షాలకు పత్తి పంట తడిసి, దెబ్బతిన్నందున 12 నుంచి 18 వరకు తేమ ఉన్న, రంగుమారిన పత్తిని కూడా తక్కువ ధరకు అయినా కొనాలని రైతులు కోరుతున్నారు. 12 వరకు తేమ ఉన్న పత్తిని ధర తగ్గించి కొంటామని సిసిఐ ప్రకటించింది. జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్ల, రంగుమారిన పత్తి విషయంలో ఎలాంటి చర్యలూ అమల్లోకి రాలేదు. కపాస్ కిసాన్ యాప్ నిర్వహణ కోసం సిసిఐ కార్యాలయంలో ప్రత్యేకంగా సాంకేతిక సిబ్బందిని నియమించారని, త్వరలో సమస్యలు పరిష్కారమవుతాయని అధికారులు చెబుతున్నారు. స్లాట్ ఓపెన్ కాకున్నా నాలుగు క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయడానికి అనుమతి ఉందని నిర్వాహకులు రైతులను మభ్యపెడుతున్నారు. ఇదేమని రైతులు ప్రశ్నిస్తే 'ఇష్టమైతే అమ్ముకో. లేదంటే నీ సరుకు నువ్వు తీసుకుపో' అంటూ బెదిరింపులకు దిగుతున్నారు.

తిరస్కరిస్తున్న సిసిఐ అధికారులు

- రైతు బలరాం, పెద్ద హరివాణం గ్రామం, ఆదోని మండలం



సిసిఐ పత్తి కొనుగోళ్లను కఠినతరం చేయడం, కపాస్ యాప్ ఇబ్బందుల నేపథ్యంలో రైతులు సిసిఐ కేంద్రాల్లో మద్దతు ధరకు పత్తి విక్రయించడం కష్టసాధ్యంగా మారింది. ఇదే అదనుగా ప్రయివేట్ వ్యాపారులు, దళారులు రంగప్రవేశం చేసి అందినకాడికి దోచుకుంటున్నారు. సిసిఐ తిరస్కరిస్తున్న పత్తిని క్వింటాకు రూ.5,500 నుంచి రూ.6 వేలకే కొనుగోలు చేస్తున్నారు. పత్తి ధర నుంచి తూకం దాకా తమదైన శైలిలో దోపిడీకి తెర లేపుతున్నారు.

తేమ పేరుతో కొర్రీలు

- వెంకటేశులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు



పత్తి లోడ్‌తో సిసిఐ కొనుగోలు కేంద్రాలకు వస్తున్న రైతులకు సంబంధిత అధికారుల నుంచి కొర్రీలు ఎదురవుతున్నాయి. తేమశాతం 12 కన్నా ఎక్కువగా ఉందని, పత్తి నల్లగా ఉందని తిరస్కరిస్తున్నారు. మిల్లులకు వస్తున్న పత్తిలో అధికభాగం ఇలా కొనుగోళ్ల తిరస్కరణకు గురవుతోంది. 12 శాతం కన్నా తక్కువ తేమ ఉన్నా ఎవరికీ కనీస మద్దతు ధర (రూ.8,100) దక్కడం లేదు. తేమశాతం 8 ఉంటేనే మద్దతు ధర వస్తుందని అధికారులు చెబుతున్నారు. చాలా మందికి క్వింటాకు రూ.7వేల నుంచి రూ.7,600 వరకే ధర పలుకుతోంది. మిగిలిన వారికి తేమశాతం లేదంటూ తిరస్కరిస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

- శ్రీనివాసులు, సీనియర్ కమర్షియల్ ఆఫీసర్



రైతులు పత్తిని ఆరబెట్టి నిర్ణీత తేమశాతం ఉండేలా చూసుకోవాలి. 12 శాతం కన్నా తక్కువగా ఉంటేనే కొనుగోళ్లు చేపట్టాల్సి ఉంటుంది. కపాస్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుంటేనే కొనుగోళ్లకు వీలవుతుంది. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

శంకరమ్మ మృతి పార్టీకి తీరని లోటు

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి - ఆదోని

సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న మాతృమూర్తి శంకరమ్మ (70) మృతి పార్టీకి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ తెలిపారు. శుక్రవారం ఆదోని పట్టణంలోని తిక్కస్వామి దర్గా ప్రాంతంలో ఉన్న లక్ష్మన్న గృహంలో శంకరమ్మ మృతదేహానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, కెవి.నారాయణ, కె.వెంకటేశులు, ఎమ్‌డి.ఆనంద్ బాబు, జిల్లా నాయకులు రామాంజనేయులు పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సిపిఎం పట్టణ కార్యదర్శి డి.లక్ష్మన్న మాట్లాడుతూ... తన తల్లి శంకరమ్మ అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారని తెలిపారు. వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ఫోన్‌లో మాట్లాడారు. శంకరమ్మ మరణం తనను కలచివేసిందన్నారు. పార్టీలోకి వచ్చిన 1990 కొత్తల్లో ఎంతో ప్రోత్సహించారని తెలిపారు. తన స్వగ్రామం దొడ్డనగేరిలో గొడవలు ఉన్న సమయంలో షేకన్న, శంకరమ్మ చిన్న గుడిసెలో ఉండి కార్యకర్తలు ఇబ్బంది పడుతుంటే వారికి అన్నం పెట్టి ఆదరించిన ఆదర్శ దంపతులని కొనియాడారు. ఆదోనిలో తిక్క స్వామి దర్గా దగ్గర ఉన్నప్పుడు తన కుటుంబానికి అండగా నిలిచారని, పార్టీ కోసం ఇల్లు వదిలిపెట్టి వెళినా వారు తన కుటుంబాన్ని దగ్గరుండి చూసుకున్న సందర్భాలు ఉన్నాయని తెలిపారు. అలాంటి శంకరమ్మ మృతి చెందడం బాధ కలిగించిందని వాపోయారు. అంత్యక్రియలకు రాలేకపోతున్నందుకు చింతిస్తున్నానని సందేశం పంపారు. ఆ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, సీనియర్ న్యాయవాది బషీర్, న్యాయవాది సాయి, సూర్య రిపోర్టర్ రాము, సిపిఎం సీనియర్ నాయకులు పి.ఈరన్న, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.వీరశేఖర్, ఐద్వా జిల్లా కోశాధికారి పిఎస్.సుజాత, మునెమ్మ, సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న, పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.గోపాల్, తిప్పన్న, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బి.వీరారెడ్డి, డి.రామాంజనేయులు, జె.రామాంజనేయులు శంకరమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం పట్టణ నాయకులు నాగరాజు, నాగేంద్ర, వీరేష్, వెంకటేష్, మునెప్ప, మండల నాయకులు బాష, మల్లికార్జున, కైలాష్, అజయ్, కీరా ఉన్నారు.



శంకరమ్మ (ఫైల్)



శంకరమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

పరిశుభ్రతకు కృషి

- డిఎల్‌డిఒ బాలకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

ప్రతి గ్రామంలో పరిశుభ్రతకు కృషి చేయాలని, ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేయాలని డిఎల్‌డిఒ బాలకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని కామవరం, ఎరిగేరి, ఉరుకుంద, కౌతాళం గ్రామాలను సందర్శించి పరిశుభ్రత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో శానిటేషన్, డోర్ టు డోర్ కలెక్షన్, గ్రీన్ అంబాసిడర్ల జీతాలు, వర్మీకంపోస్ట్ తయారీ, పబ్లిక్ టాయిలెట్ వినియోగం, బహిరంగ మల విసర్జనను నిషేధించడం, విజిబుల్ విలేజ్ నిర్వహణ, ఇంటి మరుగుదొడ్ల నిర్మాణం, వీధుల పరిశుభ్రత, సాలిడ్ వెస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ల కార్యకలాపాలు, డ్రెయినేజీలను శుభ్రం చేయడం, చెత్త కుప్పల తొలగింపు వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంచాయతీ అభివృద్ధి అధికారులు రోజూ ఉదయం 7 గంటలకు తప్పనిసరిగా గ్రామాలను సందర్శించి, డోర్ టు డోర్ కలెక్షన్, చెత్త పారవేయడం, డ్రై వేస్ట్, గ్రీన్ అంబాసిడర్ల హాజరు, చెత్త కుప్పల తొలగింపు వంటి అంశాలను పరిశీలించాలని ఆదేశించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ట్యాక్స్, నాన్ ట్యాక్స్ వసూళ్లపై సమగ్ర సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన సౌకర్యం మేరకు అన్ని పన్నులూ తప్పనిసరిగా స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా మాత్రమే చెల్లింపు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు సేవలందించే అన్ని పంచాయతీ కార్యాలయాలు పూర్తిగా అందుబాటులో ఉండాలని, ప్రజా సేవలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఎంపిడిఒ రాజేంద్ర ప్రసాద్, డిప్యూటీ ఎంపిడిఒ రాజశేఖర్ పాల్గొన్నారు.



కౌతాళంలో మాట్లాడుతున్న డిఎల్‌డిఒ బాలకృష్ణారెడ్డి



చిప్పగిరి : పారిశుధ్య కార్మికులతో డిఎల్‌డిఒ, ఎంపిడిఒ

చిప్పగిరి : పంచాయతీల్లో పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని, వారి వల్లే ప్రజలందరూ ఆరోగ్యవంతులుగా ఉంటారని శ్రీకాళహస్తి నుంచి వచ్చిన ప్రత్యేకాధికారి, డిఎల్‌డిఒ అమర్‌నాథ్, ఎంపిడిఒ అల్లాబకాష్, డిప్యూటీ ఎంపిడిఒ నాగరాజు తెలిపారు. చిప్పగిరిలో పారిశుధ్య కార్మికులు చేసే పనుల్లో అధికారులు పాల్గొన్నారు. అనంతరం మండల కార్యాలయంలో 'పరిశుభ్రత, పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా పంచాయతీ పారిశుధ్య కార్మికులకు 'గ్రామాల్లో ఎలా సేవలందించాలి' అనే అంశంపై ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఏపీవో జుబేర్ అహ్మద్, పరిపాలన అధికారి శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు బాలన్న, నరేంద్ర, జయరాం నాయక్, సిసింద్రీ, సుధీర్, సురేంద్ర, ప్రమీల, హరిబాబు పాల్గొన్నారు.

పారిశుధ్యం పట్ల అవగాహన పెరగాలి

- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పారిశుధ్యం పట్ల ప్రజల్లో అవగాహన పెరగాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్కు రోడ్డు, హాస్పిటల్ రోడ్డు, కమిటీ రోడ్, శివ సర్కిల్, సోగనూరు రోడ్డు, కర్నూలు బైపాస్ రోడ్డు పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... చెత్త సేకరణ పనులకు సహకరించాలని కోరారు.

మత్స్య ఉత్పత్తి కేంద్రాన్ని అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

మత్స్య ఉత్పత్తి కేంద్రాన్ని కోనసీమ తరహాలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం గోనెగండ్లలోని సంజీవయ్య సాగర్ ప్రాజెక్టులో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం నిర్వహించారు. మత్స్య శాఖ, మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో 'మన చెరువు-మన చేపలు' చేపట్టారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జయ నాగేశ్వరరెడ్డి హాజరయ్యారు. ముందుగా గంగపూజ చేశారు. అనంతరం మత్స్య శాఖాధికారుల సహకారంతో చేప పిల్లలను ప్రాజెక్టులోకి వదిలారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రాజెక్టులో చేప పిల్లలను పెంచే మత్స్య కేంద్రాన్ని అంతర్జాతీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కోనసీమ తరహాలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. అనంతరం స్థానిక మత్స్యకార సంఘం నూతన కార్యాలయ నిర్వహణకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.2.5 లక్షల చెక్కును అందజేశారు. మత్స్యశాఖ డిడి రంగనాథ్ బాబు, ఎఫ్‌డిఒలు నాగరాజు, మద్దిలేటి, మత్స్యకార సంఘం నాయకులు రంగస్వామి, మునిస్వామి పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలంలోని మంచాల, చెట్నిహళ్లి, సుంకేశ్వరి గ్రామాల్లోని గంగ పుత్రులు మత్స్యకారుల దినోత్సవం నిర్వహించారు. శుక్రవారం గంగపుత్రుల సంఘం అధ్యక్షులు శాంతయ్య, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, వైసిపి నాయకులు బొంబాయి శివ, టిడిపి నాయకులు చిన్న సుంకప్ప, వట్టెప్ప గారి నరసింహ, చిన్న భీమా, సున్నం రామకృష్ణ, గనేకంటి రఘు, చెట్నిహళ్లి గ్రామంలో గంగ పుత్రుల సంఘం నాయకులు గంగుల వెంకటేశ్, గంగుల మల్లికార్జున, సర్పంచి అంజిని, టిడిపి నాయకులు మల్లేష్ ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకారులు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గంగాదేవి, భీష్మాచార్యుల చిత్రపటాలను ఉంచి పూజలు చేసి.. గంగమ్మ గుడి దగ్గర నుంచి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా మీదుగా పురవీధుల్లో మహిళలు కలశాలతో.. యువకులు నృత్యాలు చేస్తూ ఊరేగించారు. తిరిగి గంగమ్మ గుడి వరకు తీసుకెళ్లారు.

ట్రాక్టర్లతో పంచాయతీలకు ఉపయోగం

- సర్పంచి కరివేముల సావిత్రి

ప్రజాశక్తి - చిప్పగిరి

పంచాయతీలకు ట్రాక్టర్లు ఉపయోగపడతాయని సర్పంచి కరివేముల సావిత్రి తెలిపారు. శుక్రవారం బెల్డోన సచివాలయం దగ్గర 'స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర' కింద మంజూరయిన ట్రాక్టర్ ట్రాలీని సర్పంచి సావిత్రి, పంచాయతీ కార్యదర్శి సురేంద్ర ఆధ్వర్యంలో పంచాయతీకి అనుసంధానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చాక పంచాయతీలకు అధిక నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. 2024 జూన్‌లో ట్రాక్టర్ ఇంజిన్ మంజూరు కాగా, ఇప్పుడు ట్రాక్టర్ ట్రాలీ మంజూరయిందని తెలిపారు. పంచాయతీలకు ట్రాక్టర్లు ఉండడం ద్వారా గ్రామాల్లో పంచాయతీల ద్వారా జరిగే పనులకు చాలా ఉపయోగపడతాయని చెప్పారు. గ్రావెల్ తోలుకోవడానికి, పారిశుధ్య పనులకు ఉపయోగపడతాయని తెలిపారు. పంచాయతీల ట్రాక్టర్లను పంచాయతీ పారిశుధ్య కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాగునీటి సంఘం మాజీ డైరెక్టర్ శ్రీనివాసులు, కరివేముల గోవిందు, విఆర్ఒ చంద్ర నాయక్, డిజిటల్ అసిస్టెంట్ గోవిందరాజులు, వెల్ఫేర్ అసిస్టెంట్ మధు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ భారతి పాల్గొన్నారు.



ట్రాక్టర్ దగ్గర ఉన్న సర్పంచి సావిత్రి, టిడిపి నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని : ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కార దిశగా చొరవ చూపడమే ప్రజాదర్బార్ లక్ష్యమని టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన స్వగృహంలో బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడారు. గ్రామాల్లో వీధిలైట్లు, శానిటేషన్, నీటి సమస్య, రోడ్ల ఏర్పాటు, భూ ఆక్రమణలు, రెవెన్యూ, విద్యుత్ సమస్యలు, ఇంటి స్థలాలు, పక్కా ఇళ్ల కోసం, తదితర అంశాలపై పలువురి నుంచి అర్జీలు స్వీకరించామన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు ఉన్నారు.

అందుబాటులో ఉంటూ సేవలందిస్తాం

- టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి

మంత్రాలయం : ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని మాధవరం గ్రామంలోని ఆయన స్వగృహంలో ఉన్న టిడిపి కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నియోజకవర్గంలోని పేదల సమస్యలు అడిగి తెలుసుకొని సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. రెవెన్యూ సమస్యలు, పిఎం కిసాన్, పింఛన్లు, ఇళ్లు, రేషన్, రోడ్లు, డ్రెయినేజీ వంటి అంశాలపై ప్రత్యేకంగా స్పందించాలని కోరారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'రైతులకు అండగా కూటమి ప్రభుత్వం'


ప్రజాశక్తి - నందవరం : అన్నదాత సుఖీభవ రెండో విడత నగదును అందించి కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందని టీడీపీ కనకవీడు గ్రామ అధ్యక్షులు డబ్బా ఈరన్న తెలిపారు. శుక్రవారం కనకవీడు టిడిపి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలుపుకుందని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసిందని చెప్పారు. కూటమి అధినేతలకు, ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డికి నాయకులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే బీవీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

జిల్లాతోనే అభివృద్ధి

- బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు శ్రీధర్

ప్రజాశక్తి - ఆదోని

రెవెన్యూ డివిజన్ కేంద్రమైన ఆదోనిని జిల్లాగా ప్రకటిస్తేనే సమగ్రాభివృద్ధి సాధ్యమని బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నఖాతే శ్రీధర్ తెలిపారు. ఆదోనిని జిల్లా చేయాలని, పెద్దహరివాణం గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని కోరుతూ చేపట్టిన శిబిరం శుక్రవారం 6వ రోజుకు చేరుకుంది. బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాగా ప్రకటిస్తూనే నాలుగు మండలాలుగా ఏర్పాటు చేస్తే ఇక్కడి ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు. ఆదోనిని జిల్లా చేయడమే కాకుండా ఆదోని నియోజకవర్గానికి నాలుగు మండలాలు ఏర్పాటు చేసి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటుందించాలని కోరారు. ఆదోని నియోజకవర్గంలో 42 గ్రామాలు కలిపి ఒకే మండలంగా ఉండడం వల్ల సరయిన నిధులు రాక అభివృద్ధిలో వెనుకబడి పోతోందన్నారు. విభజన చేసి, ఆదోని కేంద్రంగా జిల్లాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. బ్రాహ్మణ సంఘం నాయకులు రాఘవేంద్రాచార్, వెల్లాల మధుసూదన శర్మ మాట్లాడుతూ... ఆదోని జిల్లా అయితే విద్య, వైద్య, వ్యవసాయ అభివృద్ధితో పాటు ప్రజల జీవనశైలిలో మార్పులు వస్తాయన్నారు. బ్రాహ్మణ సంఘం నాయకులు మఠం రామచంద్ర, దేశాయ్ గిరి, భీమసేనాచార్, మఠం శంకరశాస్త్రి, కరణం మంజునాథ్, వైద్యం నాగరాజు, మధుసూదన రావు, గరుఢాద్రి దత్తాత్రేయ శర్మ, కమలనాభశర్మ దీక్షల్లో కూర్చున్నారు. ప్రముఖ న్యాయవాది గిరిధర్ జెబి గార్డెన్ అధినేత, టిడిపి నాయకులు కల్లుపోతుల రంగన్న సంఘీభావం తెలిపారు.



దీక్షలో బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు

డిప్యూటీ డైరెక్టర్ రామకృష్ణకు సన్మానం

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని బూదూరు గ్రామంలో రీసర్వేపై తనిఖీ చేసిన రామకృష్ణను సర్వే శాఖ సిబ్బంది సన్మానించింది. శుక్రవారం సర్వే అకాడమీ సామర్లకోట నుంచి డిప్యూటీ డైరెక్టర్ జిపి.రామకృష్ణ శాలువా, రాఘవేంద్రస్వామి చిత్రపటం, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని బుదూరు, దిబ్బనదొడ్డి రీ సర్వే పనుల గురించి ఇన్‌స్పెక్షన్ చేసేందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. డివిజనల్ సర్వే ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఉరుకుందాచారి, డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాసరాజు, కర్నూలు టాస్క్ ఫోర్స్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ విజయ కుమారి, మండల సర్వేయర్ అశోక్, విలేజ్ సర్వేయర్ తిమ్మేష్ పాల్గొన్నారు.



రామకృష్ణను సన్మానిస్తున్న అధికారులు

భక్తులకు సేవలో.. ఉరుకుంద క్షేత్రం నెంబర్ వన్

ప్రజాశక్తి - కౌతాళం

రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన శ్రీలక్ష్మినరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రం భక్తులకు సేవలందించడంలో ముందు వరుసలో నిలిచిందని దేవాలయ డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. పుణ్యక్షేత్రాల్లో భక్తులకు ఎలాంటి సేవలు అందుతున్నాయో..? ఏమైనా ఇబ్బందులు పడుతున్నారా..? దర్శనం సౌకర్యాలు ఎలా ఉన్నాయి..! స్వామి వారి ప్రసాదం నాణ్యత ఎలా ఉంది..? పుణ్యక్షేత్రంలో మౌలిక వసతులు, నిత్యాన్నదానం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై ప్రభుత్వ అధికారులు ప్రతినెలా వివరాలు సేకరిస్తున్నారు. ఈ అంశాల్లో భక్తుల నుంచి వచ్చిన స్పందనను ఆధారంగా చేసుకుంటూ ర్యాంకులు కేటాయిస్తూ దేవదాయ శాఖకు పంపిస్తారు. జిల్లా కేంద్రాల్లో జరిగే సమావేశాల్లో, కలెక్టర్ల సమావేశంలో పుణ్యక్షేత్రాల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై చర్చిస్తారు. రాష్ట్రంలోని 22 ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో కౌతాళం మండలం ఉరుకుంద గ్రామంలో వెలిసిన శ్రీలక్ష్మినరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం భక్తులకు సేవలు అందించడంలో ప్రథమ స్థానం సాధించింది. ఆగస్టులో 14వ ర్యాంకు, సెప్టెంబర్‌లో 9వ ర్యాంకు, అక్టోబర్‌లో 1వ ర్యాంకు సాధించినట్లు ప్రభుత్వ అధికారులు ప్రకటించిన పట్టిక ద్వారా వెల్లడయింది. పుణ్యక్షేత్రంలో శ్రావణమాస ఉత్సవాలు, కార్తీక మాస ఉత్సవాలు డిప్యూటీ కమిషనర్ వాణి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించడానికి అనేక కార్యక్రమాలు చేపట్టారు. దేవాలయ, అర్చక సిబ్బందితో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ, భక్తులకు మంచి సేవలు అందించడానికి కృషి చేస్తున్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

- పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రామారావు

ప్రజాశక్తి - నందవరం



పనులు చేయిస్తున్న రామారావు

నందవరం గ్రామంలో పారిశుధ్య పనులు పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రామారావు ఆధ్వర్యంలో ముమ్మరంగా జరిగాయి. గ్రామంలో పేరుకుపోయిన చెత్తాచెదారం, డ్రెయినేజీలో నిండిన మురుగును శుక్రవారం తొలగించారు. మూడు రోజులుగా రోజూ 22 మంది కార్మికులతో గ్రామ పరిశుభ్రతకు పని చేసినట్లు ఆయన తెలిపారు. వీధివీధినా పరిసరాలను శుభ్రం చేసి బ్లీచింగ్ చేయించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కోరారు. చెత్తాచెదారం ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఇంటి దగ్గరికి వచ్చే హరిత రాయబారికి అందించాలని తెలిపారు. మరుగుదొడ్లు ఉన్నవారు వాటిని వినియోగించాలని కోరారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను కూడా పాటించాలని సూచించారు. గ్రామస్తులు అనారోగ్యానికి గురికాకుండా తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు.